ఎస్ఎఫ్‌టీకి 50 ఇవ్వాల్సిందే

'త్రూ ప్రాపర్ చానెల్'ను కలిస్తేనే అనుమతులు

- లే అవుట్లు, భవనాల పర్మిషన్స్‌కు నయా దందా
- హెచ్ఎండీఏలో ఆ ముగ్గురి చేతుల్లోనే ఫైళ్లు క్లియరెన్స్
- రేటు ఫిక్స్ చేసి..పర్మిషన్లలో చక్రం తిప్పుతున్న షాడోలు
- అడిగినంత ఇచ్చుకోలేక తలలు పట్టుకుంటున్న బిల్డర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): 'లే అవుట్లు, భవన నిర్మాణాలకు అనుమతులు కావాలా? అయితే ఫలానా ముగ్గురు సార్లను కలిసి రండి.. వాళ్లే చూసుకుంటారు.. అప్పటివరకు ఫైల్ ఇక్కడే ఉంటది.. వాళ్ల నుంచి క్లియరెన్స్ వస్తేనే ఫైళ్లు ముందుకు..' ఇదీ హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ 'హెచ్ఎండీఏ) సిబ్బంది రియల్టర్లకు చెప్తున్న మాట. 'త్రూ ప్రాపర్ చానల్' ద్వారా కాకుండా నేరుగా లే అవుట్లు, భవన నిర్మాణ అనుమతుల కోసం ఎవరైనా వెళ్తే వారికి చుక్కెదురు అవుతున్నది. 'త్రూ ప్రాపర్ చానల్' ద్వారా రావాలంటూ అక్కడి ఉన్నతాధికారులే ఓ ప్రముఖ బిల్డర్ (ముఖ్యనేతకు దగ్గరి బంధువు), ప్రభుత్వ పెద్దకు షాడో, మరో బలమైన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి నంబర్, అడ్రస్ ఇచ్చి పంపుతున్నారు. రంగారెడ్డి జిల్లా కొంగర్‌కలాన్‌లో 17 ఎకరాల లే అవుట్ చేసిన బిల్డర్‌కు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. లే అవుట్‌కు సంబంధించి కిందిస్థాయి నుంచి కమిషనర్ ద్వారా అనుమతి దక్కింది. కానీ, రోజులు గడుస్తున్నా.. డీసీ లెటర్ మాత్రం రిలీజ్ కాలేదు. ఆదేమంటే 'త్రూ ప్రాపర్ చానెల్' అంటూ ఆ ముగ్గురు పేర్లు సదరు బిల్డర్లకు వినబడ్డాయి. ఇదొక్కటే కాదు, ఐదు ఎకరాల పైబడిన లే అవుట్, లే అవుట్ కం హౌజింగ్, ఐదు లక్షల ఎస్ఎఫ్‌టీతో కూడిన బిల్డింగ్‌లన్నీ హెచ్ఎండీఏలో కాకుండా 'త్రూ ప్రాపర్ చానెల్' ద్వారానే అనుమతులు దక్కుతున్నట్టు రియల్ఎస్టేట్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

డబ్బులివ్వకుంటే కొర్రీలు

ఓపెన్ లే అవుట్, లే అవుట్ విత్ హౌజింగ్, మల్టీస్టోరేజ్ బిల్డింగ్.. నిర్మాణం ఏదైనా... సకాలంలో అనుమతి దక్కాలంటే ఆ ముగ్గురితో బేరం కుదుర్చుకుని ప్రాజెక్టులో చదరపు మీటర్‌కు రూ.50 చొప్పున సమర్పించుకోవాలి. లేదంటే కొర్రీలతో నెలల తరబడి నిరీక్షణ తప్పదు. కొందరు అధికారులు ఈ ముగ్గురికి సహరిస్తూ వారి ప్రమేయంతోనే నచ్చిన ఫైళను 'ఒకే' చేస్తున్నారని, 'త్రూ ప్రాపర్ చానల్'ను కలవకపోతే ఆ ఫైళ్లకు 'డిస్కస్', 'స్పీక్' అంటూ అధికారులు కొర్రీ పెడుతున్నారని బిల్డర్లు వాపోతున్నారు. అసలే రియల్ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతిన్న తరుణంలో ఇప్పటికే ఉన్న వారిని ప్రోత్సహించాల్సింది పోయి వసూళ్ల దందా మొదలు పెట్టడం ఏమిటని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. టీజీ బీపాస్ వచ్చిన నిర్ణీత వ్యవధిలో అనుమతులు మంజూరు చేయకుండా నెలల తరబడి ఫైళ్లను పెండింగ్‌లో పెట్టుకుంటున్నారని, ఏపీవో నుంచి కమిషనర్ స్థాయి వరకు ఫైళ్లు రోజుల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని చెప్తున్నారు. వందలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో బిల్డర్లకు ఎదురు చూపులు తప్పడం లేదని పేర్కొంటున్నారు.

మాజీ మంత్రులూ బాధితులే

నిర్మాణరంగ అనుమతుల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాల్సిన అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన నిర్మాణ అనుమతుల విషయంలో ఎక్కువ కొర్రీలు పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. బాచుపల్లిలో ఒక మాజీ మంత్రికి చెందిన దవాఖానా విషయంలో అక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీకి లేని కొర్రీ పెట్టినట్టు తెలిసింది. దీంతోపాటు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మాజీ మంత్రికి సంబంధించిన అనుమతుల విషయంలో ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు సమాచారం.

నాన్ క్యాడర్ అధికారులదే హవా!

హెచ్ఎండీఏలో కొందరు అధికారుల తీరు చర్చనీయాంశంగా మారింది. వాళ్లు చేయాలనుకున్నదే ఫైల్, లేదంటే వెనక్కి తిప్పి పంపుతూ అనుమతుల విషయంలో ముప్పుతిప్పలు పెడుతున్నారు. ముఖ్యంగా కమిషనర్, జాయింట్ కమిషనర్ తర్వాత కీలక అధికారిగా ఉన్న నాన్ క్యాడర్ ఉన్నతాధికారులు కొన్నేండ్లుగా అక్కడే తిష్టవేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తనకు సంబంధం లేని విభాగాల కార్యాచరణలోనూ కాలు పెడుతూ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నట్టు ఉద్యోగులు చెప్తున్నారు. లే అవుట్, భవన నిర్మాణ అనుమతుల విషయంలో, సంస్థ చేపట్టే భారీ ఇంజినీరింగ్ ప్రాజెక్టుల టెండర్ల రూపకల్పనలో జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఒక టెండర్ విషయంలో తమ వాళ్లకే కట్టబెట్టేలా నిబంధనలు రూపొందించి, దానిని అప్రూవ్ చేసేలా పై అధికారులపై ఒత్తిడి చేశారనే ప్రచారం జరుగుతున్నది. దీనిని హెచ్ఎండీఏలో సీనియర్ ఐఏఎస్ అధికారి పసిగట్టి ఆ ఫైల్‌ను పక్కన పెట్టారని, ఆ కోపంతో సదరు అధికారిపై లేని పోని ఆరోపణలు వచ్చేలా తోటి అధికారులను ఊసిగొలుపుతారన్న చర్చ జరుగుతున్నది. బిల్డింగ్, లే అవుట్ అనుమతుల విషయంలోనూ అనేక అక్రమాలకు తెరలేపాడని, ఏండ్ల తరబడి పాతుకుపోయిన సదరు నాన్ క్యాడర్ అధికారులపై కమిషనర్ చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

నీఎం రేవంత్‌రెడ్డిపై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

పాలన చేతకాక బెదిరింపులు

- రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాదు..ముఠా నేత
- కేటీఆర్, హరీశ్‌లను బెదిరిస్తూ హింసకు ప్రేరేపణ
- బంజారాహిల్స్ ఠాణాలో బీఆర్ఎస్ ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలి : ఎర్రోళ్ల

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ)/బంజారాహిల్స్: సీఎం రేవంత్‌రెడ్డి పాలన చేతగాక అసహనంతో బెదిరింపులకు దిగుతున్నారని, అశాంతిని రేకెత్తించేందుకు ప్రయత్నిస్తున్నారని, సీఎంలా కాకుండా ముఠా నేతలా వ్యవహరిస్తున్నారని, కేటీఆర్, హరీశ్‌రావులను బెదిరిస్తూ హింసను ప్రేరేపిస్తున్నారని, ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి 'వీపు చింతపండు చేస్తా..బుల్డోజర్లు ఎక్కించి తొక్కుతా' అంటూ ఆటవిక భాష మాట్లాడడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఆయన వైఖరితో కాంగ్రెస్ కార్యకర్తలు రెచ్చిపోయే ప్రమాదం ఉన్నదన్నారు. ఖమ్మంలో హరీశ్‌రావుపై, ముషీరాబాద్‌లో కేటీఆర్‌పై, కొండాపూర్‌లో పాడి కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో చిన్న పోస్ట్ పెట్టినా పోలీసులు కేసు నమోదు చేస్తున్నారని, రాష్ట్రంలో హింసను ప్రేరేపించేలా మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డిపై క్రిమిన ల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు గెల్లు శ్రీనివాస్, రాజీవ్‌సాగర్, రామచంద్రనాయక్, ఇంతియాజ్, రాకేశ్‌కుమార్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజు, కిశోర్‌గౌడ్, తుంగబాలు, విజయ్‌కుమార్, రంగినేని అభిలాష్, రాంచందర్ తదితరులున్నారు.

ఏఈవోలపై వేటు

> మొదటిపేజీ తరువాయి...

నుంచి మొదలైన సస్పెన్షన్ల పరంపర సాయంత్రం వరకు కొనసాగింది. జిల్లాకు కనీసం 5-10 మం దిని సస్పెండ్ చేసినట్టుగా తెలిసింది.

దారికొచ్చేవరకు సస్పెన్షన్లు

ఏఈవోలు దారికి వచ్చే వరకు ప్రతిరోజు కొంతమందిపై వేటు వేయాలనే ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్టుగా తెలిసింది. ఏదో ఒక కారణంతో ప్రతి రోజు కనీసం 100 మందిపై వేటు వేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్టుగా తెలిసింది. మొదట కొంతమంది ఏఈవోలపై వేటు వేస్తే మిగిలిన ఏఈవోల్లో భయం ఏర్పడుతుందని, అప్పుడే దారికొస్తారని ఉన్నతాధికారులు భావిస్తున్నట్టుగా తెలిసింది. డిజిటల్ క్రాప్ సర్వే చేయకపోవడమే 165 మంది ఏఈవోల సస్పెన్షన్‌కు కారణం అనేది బహిరంగ రహస్యం. ఉన్నతాధికారులు మాత్రం రైతుబీమా నిబంధనల ప్రకారం మృతి చెందిన రైతుల వివరాల నమోదులో ఏఈవోలు నిర్లక్ష్యంగా వహించారని, అందుకే సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రైతుబీమా కారణం చూపి..

నిబంధనల ప్రకారం రైతు చనిపోయిన తర్వాత నాలుగు రోజుల్లో మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు అన్ని రకాల పత్రాలను జత చేసి.. సదరు ఏఈవో రైతుబీమా పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలి. కానీ రైతు చనిపోయిన తర్వాత వారి కుటుంబ సభ్యులు కనీసం 11 రోజుల వరకు బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. వివరాలు అందించేందుకు కనీసం 15 రోజుల సమయం పడుతుంది. అలాంటప్పుడు నాలుగు రోజుల్లో వివరాలు ఏ విధంగా అప్‌లోడ్ చేయాలని ఏఈవోలు ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అర్థం చేసుకోకుండా తమపై కక్షగడితే ప్రయోజనం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇక్కడ మరో ముఖ్య విషయం ఏంటంటే... సస్పెన్షన్ ఉత్తర్వుల్లో అధికారులు చూపిన కారణంతో ఏ ఒక్క రైతు కుటుంబానికి కూడా రైతుబీమా పరిహారం అందని పరిస్థితి లేదు. అలాంటప్పుడు ఏఈవోలపై ఏ విధంగా చర్యలు తీసుకుంటారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

డైరెక్టర్ గోపితో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్న ఏఈవోలు

మూకుమ్మడి సెలవులో 2600 మంది ఏఈవోలు...!

తోటి ఉద్యోగులను సస్పెండ్ చేయడాన్ని ఏఈవోలు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఇక ప్రభుత్వంతో తాడోపేడో తెల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించారు. తాము సామరస్యంగా ముందుకెళ్తుంటే అధికారులు మాత్రం రెచ్చగొట్టే ధోరణి అవలంభిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 165 మంది ఏఈవోలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను నిర్వహించాలని నిర్ణయించినట్టు ఏఈవోలు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే, సస్పెన్షన్లను రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 2600 మంది ఏఈవోలమంతా మూకుమ్మడి సెలవు పెట్టేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు.

కమిషనరేట్లో ధర్నా... పట్టించుకోని డైరెక్టర్

165 మంది ఏఈవోలను సస్పెండ్ చేయడంపై ఇతర ఏఈవోలు భగ్గుమన్నారు. సస్పెన్షన్లతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ ఏఈవోలు హైదరాబాద్‌లోని వ్యవసాయ శాఖ డైరెక్టరేట్‌కు తరలివచ్చారు. సాయంత్రం భారీ సంఖ్యలో చేరుకున్న ఏఈవోలు అక్కడే ధర్నాకు దిగారు. సస్పెన్షన్లను వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. డైరెక్టర్ గోపిని కలిసేందుకు ఏఈవోలు ప్రయత్నించగా ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. డైరెక్టర్ ఆఫీసు నుంచి బయటకు వెళ్లే సమయంలో ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించగా పట్టించుకోకుండా వెళ్లిపోయినట్టుగా ఏఈవోలు తెలిపారు. ప్రభుత్వం ఎన్ని రకాలుగా ఇబ్బంది పెట్టినా డిజిటల్ క్రాప్ సర్వే చేయబోమని స్పష్టం చేస్తున్నారు. 'ఏసీ రూముల్లో కూర్చున్న వాళ్లకేం తెలుసు మా కష్టాలు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే తెలుస్తుంది. ఇక్కడ హైదరాబాద్‌లో ఉండి మస్తు ఆదేశాలు జారీ ఇవ్వొచ్చు' అని ఓ ఏఈవో ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సురేఖపై కేసులో.. నేడు కేటీఆర్ వాంగ్మూలం

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై దాఖలు చేసిన పరువు నష్టం క్రిమినల్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు బుధవారం ప్రజాప్రతినిధుల కోర్టులో వాంగ్మూలం ఇవ్వనున్నారు. మేజిస్ట్రేట్ శ్రీదేవి ఆదేశాల మేరకు ఫిర్యాదుదారుడైన కేటీఆర్ తోపాటు సాక్షులుగా ఉన్న తుల ఉమ, బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, దాసోజు శ్రవణ్‌కుమార్ వాం గ్మూలాలను సైతం కోర్టు రికార్డు చేయనుంది. మంత్రి కొండా సురేఖ కోర్టుకు హాజరై తన మీద దాఖలైన ఆరోపణల గురించి వివరణ ఇచ్చేందుకు అవకాశాన్ని కల్పిస్తూ కోర్టు నోటీసుల్ని జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు ఆమెను బుధవారం కోర్టుకు హాజరుకావాలని లంగర్‌హౌజ్ పోలీసులు సమన్లు జారీ చేశారు.

సినీ నిర్మాత శివరామకృష్ణ అరెస్టు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 22: ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ప్రయత్నించిన కేసులో ప్రముఖ సినీ నిర్మాత బూరుగుపల్లి శివరామకృష్ణను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ పత్రాలతో రూ.వేల కోట్ల విలువైన 84 ఎకరాల భూమిని స్వాహా చేసేందుకు ఆయన ప్రయత్నించినట్టు కేసు నమోదైంది. స్టేట్ ఆర్కియాలజీ విభాగం సీనియర్ అసిస్టెంట్ కొత్తిని చంద్రశేఖర్ సహాయంతో నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమి తనదేనని శివరామకృష్ణ క్లెయిమ్ చేసుకున్నారు. బిల్డర్ మారగోని లింగంగౌడ్ సహాయంతో ఆ భూమిలో పాగా వేశారు. దీనిపై 2003లో అప్పటి ప్రభుత్వం కోర్టులో కేసు వేసింది. ప్ర భుత్వాలు మారినా హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం కొనసాగింది. చివరికి శివరామకృష్ణ వద్ద ఉన్న డాక్యుమెంట్లు నకిలీవని సుప్రీంకోర్టు తేల్చడంతో ఆయనతోపాటు చంద్రశేఖర్, లింగంగౌడ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

విగ్రహ ధ్వంసం వీడియోలను తొలగించండి

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ మహంకాళి మందిరంలోని ముత్యాలమ్మ దేవత విగ్రహాన్ని ధ్వంసం చేస్తున్నప్పుడు తీసిన వీడియోలను, వాటి లింకులను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు కేంద్ర సైబర్‌క్రైం విభాగాన్ని ఆదేశించింది. ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసం వీడియోల లింకులను తొలగించలేదంటూ న్యాయవాది ఐ రామారావు వేసిన పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి మగళవారం విచారణ జరిపారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ.. ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసం వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయని, వాటి వల్ల శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉన్నదని చెప్పారు. ఆ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు స్పందించలేదని తెలిపారు. అనంతరం ఆ వీడియోలను తొలగించాలని కేంద్ర సైబర్‌క్రైం విభాగాన్ని ఆదేశించిన న్యాయమూర్తి.. పిటిషనర్ ఫిర్యాదుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మారేడ్‌పల్లి పోలీసులకు స్పష్టం చేశారు. ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలో పాల్గొనవారిపై పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని కోరుతూ ముగ్గురు వ్యక్తులు హైకోర్టులో పిటిషన్లు వేశారు. వీటిని బుధవారం విచారణ జరుగనున్నది.

కుల, మతాలు ఐచ్ఛికమే

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): రాజ్యాంగం ప్రకారం కులం, మతం అనేవి ఐచ్ఛికమని, వాటిని బహిర్గతం చేయాలన్న నిబంధన ఏమీ లేదని హైకోర్టు స్పష్టం చేసింది. జనగణన సమయంలో కులం, మతం వివరాలను వెల్లడించాలా? లేదా అన్న స్వేచ్ఛను నేషనల్ సెన్సస్ కమిషన్ ప్రజలకే కల్పించిందని గుర్తు చేసింది.



ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలంకు ఫిర్యాదు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

రేవంత్‌పై చీటింగ్ కేసు పెట్టాలి

బూటకపు హామీలతో మోసం చేసిండు • ఎస్పీకి జోగు రామన్న ఫిర్యాదు

ఆదిలాబాద్, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ) : బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలంను కలిసి ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చక సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని పేర్కొన్నారు.

మాజీ మంత్రి గంగులకు మాతృ వియోగం

- అనారోగ్యంతో తల్లి నర్సమ్మ కన్నుమూత
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం

నర్సమ్మ (ఫైల్)

గంగుల నర్సమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ)/కార్పొరేషన్: కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాతృమూర్తి గంగుల నర్సమ్మ (85) అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని గంగుల నివాసంలో మంగళవారం ఉదయం కన్నుమూశారు. నర్సమ్మ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. శోకతప్తులైన వారి కుటుంబసభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, జోగు రామన్న, ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, సంతోష్‌కుమార్ తదితరులు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె భౌతికకాయానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ శ్రేణులు నివాళులర్పించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఏఈవోలపై వేటు అప్రజాస్వామికం

డిజిటల్ క్రాప్ సర్వేకు ఒప్పుకోలేదని ఏఈవోలపై వేటు వేయడం అప్రజాస్వామికం. పక్క రాష్ట్రాల్లో ఏజెన్సీలు, ఇతర శాఖలతో డిజిటల్ క్రాప్ సర్వే చేపడుతుంటే రాష్ట్రంలో ఏఈవోల నెత్తిన రుద్దడం ఎంతవరకు సమంజసం. ఇప్పటికే 49 రకాల విధులు నిర్వర్తిస్తున్న వారిపై అదనపు భారం మోపవద్దు. బెదిరించడం, ఉద్యోగులను విభజించడమే ప్రజాపాలనా? ప్రభుత్వం డిజిటల్ సర్వేను ఏజెన్సీలకు అప్పగించాలి. **- నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి**

సర్వే ఏఈవోల ప్రాథమిక బాధ్యత

పంట నమోదు ఏఈవోల ప్రాథమిక బాధ్యత. రైతు బీమా, రైతు భరోసా పథకాలకు సర్వే ఉపయోగపడుతుంది. సర్వేను సక్రమంగా నిర్వహించకుంటే రైతులు ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధిని కోల్పోతారు. దీనిని మెరుగ్గా, పటిష్ఠంగా నిర్వహించాలని ఏఈవోలకు నెల క్రితమే ఉత్తర్వులు జారీ చేశాం. కొందరు ఏఈవోలు పంట పొలాన్ని సందర్శించకుండా సర్వే కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నారు. **- డాక్టర్ గోపి , వ్యవసాయశాఖ సంచాలకుడు**

సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

డిజిటల్ క్రాప్ సర్వే పేరిట ప్రభుత్వం ఏఈవోలను వేధించడం అన్యాయం. పనిభారం పెరుగుతుందని, దశల వారీగా చేస్తామని చెబుతున్నా పట్టించుకోకపోవడం సరైంది కాదు. ఒకేసారి ఇంతమందిపై వేటు వేయడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి. ఇప్పటికైనా ఏఈవోలను చర్చలకు పిలువాలి. బేషరతుగా సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి. **- దేవిప్రసాద్ , ఉద్యోగ సంఘాల మాజీ చైర్మన్**

వరంగల్‌లోని రంగశాయిపేటలో ప్లకార్డులతో ధర్నా నిర్వహిస్తున్న పోలీసు కుటుంబాలు

'వన్ స్టేట్.. వన్ పోలీస్' అమలు చేయాలి

4వ బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యుల ఆందోళన

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 22: 'వన్ స్టేట్.. వన్‌కార్డ్' నినాదంతో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. శాంతి భద్రతలు కాపాడే పోలీస్ వ్యవస్థలోనూ ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలని, రిజర్వ్ పోలీసులకు ప్రత్యేక నిబంధనలు సరికాదని మామునూరు 4వ బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వారు వరంగల్ ఆర్టీవో కార్యాలయం జంక్షన్ నుంచి ప్లకార్డులు పట్టుకొని రంగశాయిపేటకు ర్యాలీ గా వెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసు లు వారిని అడ్డుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే శాఖలో ఒకే విధానాన్ని అమలు చేయకుండా బెటాలియన్ సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీస సెలవులు సైతం మంజూరు చేయకుండా విధులకు హాజరుకావాలని ఆంక్షలు విధిస్తున్నారని, దీంతో కానిస్టేబుళ్లు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు.

భార్యల ధర్నా.. భర్తల సస్పెన్షన్

నీలగిరి, అక్టోబర్ 22: తమ భర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న 12వ బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు సోమవారం ఆందోళనకు దిగారు. అధికారులు వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాల్సింది పోయి ఆందోళన చేసిన వారి భర్తలను మంగళవారం సస్పెండ్ చేశారు. బెటాలియన్ ఉన్నతాధికారులు ధర్నాలో పాల్గొన్న వారిని గుర్తించి.. కానిస్టేబుళ్లుగా పని చేస్తున్న 20 మందిని సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేస్తున్నట్టు మౌఖికంగా చెప్పిన అధికారులు వారికి ఉత్తర్వులు ఇవ్వలేదు. ఈ విషయమై వివరణ కోరేందుకు ప్రయత్నిస్తే.. బెటాలియన్ కమాండెంట్ సత్యశ్రీనివాస్‌రావు స్పందించలేదు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

- లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామంటున్న బాధితులు
- హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి ఇంటి వద్ద ఆందోళన

భువనగిరి కలెక్టరేట్/చౌటుప్పల్, అక్టోబర్ 22: ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని బాధితులు హెచ్చరించారు. అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ ప్రాంతాల భూ నిర్వాసితులు సుమారు వంద మందికిపైగా మంగళవారం హైదరాబాద్‌లో రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇంటి ఎదుట ఆందోళన నిర్వహించారు. బయటకు వెళ్తున్న మంత్రి వద్దకు వెళ్లి తమను ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు. 'ట్రిపుల్ఆర్ అలైన్‌మెంట్‌కు సంబంధించి నాకేమీ తెల్వదు.. సంబంధిత సమావేశాలకు కూడా నన్ను పిలువడం లేదు. దానిపై సీఎం రేవంత్‌రెడ్డిని అడగండి' అంటూ అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించారు. బయటకు వెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడి నుంచి మంత్రి జారుకున్నారని రైతులు చెప్పారు. దీంతో మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యాయం చేయని మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

హైదరాబాద్‌లో ఇంటి నుంచి బయటకు వెళ్తున్న మంత్రి కోమటిరెడ్డి కారును అడ్